# అంతర్గతం

మహాసముద్రం
మరో ఇసుకరేణువుని కలుపుకున్నట్టు
గురి తప్పని కాలం కొక్కేనికి
వయస్సు చిక్కుకుంటుంది
అదెటు లాగుతే అటు
జరుగుతూ జరుగుతూ
పుటుక్కున తెగేవరకూ –

తెగిపడ్డ ఉదాహరణలన్నీ
ఏరుకుంటూనో
చూసుకుంటూనో
ఏమరుపాటునో
ఎలా నడిచినా
ఆద్యంతం లేనిదాని గమనం
ఒక రాత్రినీ
ఒక పగటినీ
ప్రతి రోజూ పరుస్తుంది
అయినా అన్నీ ఒకేలా ఉండవు
ఆధారపడినట్టున్నా
ఒకదానికోసం మరొకటి ఆగిపోవు
పూలపాన్పులో గుచ్చుకునే ముళ్లో
దేనిని ఎలా భరించటమో
ధరించిన వయస్సే తెలుసుకుంటోంది
వెనుతిరిగి చూడటం వెనకబడి పోవటమే!

ఎదురు తిరగటమో

మునుముందుకు దూసుకుపోవటమో
ఎప్పటికప్పుడు సాహసమవుతోంది

నీరసపడి
చీకటిలో కలిసిపోతున్న వారిని
చూస్తూ చూస్తూ అలా ఆగిపోయామా!
మన నీడ కూడా మరొకరికి చీకటవుతుంది